క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని కొత్తపేట సీఐ గణేష్ పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని టేనర్‌పేట అడ్డరోడ్డు ప్రాంతంలో సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది స్ట్రీట్ వాక్ నిర్వహించారు. సోరంగం రోడ్డు, టేనర్‌పేట స్కూల్, కొండప్రాంతం, అల్లీనగర్, లంబాడీపేట ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సాయంత్రం వేళ యువకులు ఆటోలలో కూర్చుని రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు సీఐ గణేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఐ గణేష్ మాట్లాడుతూ రాత్రి వేళ గస్తీని పెంచడంతో పాటు స్థానికంగా ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే కంట్రోల్‌రూమ్‌కి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ వెంట సెక్టార్ ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

44, 45 డివిజన్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని 44, 45 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్ ఎగువ మణెమ్మ బడ్డీ కొట్టు వద్ద కొండపైన రూ.5 లక్షల వ్యయంతో మెట్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, కాంట్రాక్టర్ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

45వ డివిజన్ కొండ ప్రాంతంలో

స్థానిక 45వ డివిజన్ పరిధిలో ఉన్న కొండబడి ఎదురుగాగల కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, దుర్బేసుల హుస్సేన్, ముత్తా వాసు, దావాల బుజ్జి, ముత్యాల రాంబాబు, బైపినేని కోటేశ్వరరావు, సీహెచ్ లక్ష్మణ్, ఏలూరు కిరణ్, గుండు లక్ష్మి, రవ్వా కోటేశ్వరి, సచివాలయ సెక్రటరీ బుచ్చిబాబు, కాంట్రాక్టర్ కె బాలకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

ట్రైకార్ డైరెక్టర్‌గా రామకృష్ణ కొనసాగింపు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ డైరెక్టర్ అయిన భవానీపురం ఊర్మిళానగర్‌కు చెందిన మద్దిల రామకృష్ణ (ఎమ్ఆర్‌కె) పదవీ కాలాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవారం ఉత్తర్వులను అందుకుని విధులకు హాజరయినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ఎరుకల ఆత్మ గౌరవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న తనను గుర్తించి ట్రైకార్ డైరెక్టర్‌గా సముచిత స్థానం కల్పించటమే కాకుండా తన పదవీ కాలం పూర్తయినప్పటికీ కొనసాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. పలువురు ఎస్టీ నాయకులు రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ చేసిన 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒకరిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో కాలనీలో తనిఖీలు చేపట్టగా విద్యాధరపురానికి చెందిన కొణతల సుబ్బారావు(34) మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తెలుసుకుని అతనిని అరెస్టు చేశారు. సుబ్బారావు వద్ద 18 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గుణదల (విజయవాడ తూర్పు): ఆరోగ్యం పట్ల మహిళలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రముఖ వైద్యురాలు ఎస్.హిమబిందు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో విజయపథంలో నడుస్తున్నారని తెలిపారు. దీనితో పాటు స్త్రీలలో మానసిక, శారీరక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించాలని కోరారు. ఆందోళన చెందకుండా తగిన వైద్యం తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్య తలెత్తినపుడు తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్ టి.తబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబు చేసేవన్నీ మోసాలే.. చెప్పేవన్నీ అబద్ధాలే

- ఎంపీ కేశినేని నాని
- పశ్చిమంలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



చెక్కును అందిస్తున్న ఎంపీ కేశినేని నాని, షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబునాయుడు చేసేవన్నీ మోసాలే, చెప్పేవన్నీ అబద్ధాలేనని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల్లో అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధుల నమూనా చెక్కును బుధవారం వించిపేటలోని ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని 2783 స్వయం సహాయక సంఘాల్లోని 27,352 మంది అక్కాచెల్లెమ్మలకు రూ.20,63,83,667 విలువైన చెక్కును అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమం అద్భుతం జరిగిందన్నారు. కరోనాతో యావత్ ప్రపంచం అల్లాడిపోతే జగన్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారన్నారు. విజయవాడ నగరంలో మూడు నియోజకవర్గాల్లోని డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా రూ.322 కోట్లను చెల్లించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. చంద్రబాబు గ్యారెంటీ కేవలం ఆయన కుమారుడికేనన్నారు. రానున్న కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగానే అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు తన పాలనలో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ అంటూ ప్రజలను మోసం చేసిన విషయం అందరికీ గుర్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే ఆసరా పథకం ద్వారా సుమారు రూ.81.63 కోట్లను అక్క చెల్లెమ్మలకు అందించారన్నారు. రాయన భాగ్యలక్ష్మి మాట్లాడారు. సభకు కార్పొరేటర్ బుల్లా విజయకుమార్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఆర్షద్, మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఇర్ఫాన్, రెహమతున్నీసా, గోదావరి గంగ, అత్తులూరి ఆదిలక్ష్మి, బాలసాని మణెమ్మ, శిరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, బోయి సత్యబాబు, నాయకులు మైలవరపు దుర్గారావు, తంగెళ్ల రామచంద్రరావు, బంక విజయ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మేయర్ భాగ్యలక్ష్మి



తాగునీటి సరఫరాపై ఆరా తీసుకున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులకు తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా నిత్యం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సరఫరాలో సమస్యలు రాకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం వీరిరువురూ 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నూతనంగా వేసిన బోర్ వెల్స్‌ను తనిఖీ చేశారు. యుద్ధ ప్రాతపదికన నిర్మాణం పూర్తి చేసి తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజీవ్‌నగర్ ప్లే స్కూల్ పక్కన పార్క్ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలకు గురికాకుండా త్వరితగతిన కాంపౌండ్ వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి 25వ డివిజన్, కాల్వగట్టు ప్రాంతాన్ని పరిశీలించి స్థానికంగా ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని, డ్రెయిన్ నిర్మాణం, సీతారాంపురం పంపింగ్ స్టేషన్, బీటీ రోడ్డు అభివృద్ధి తదితర పనులు వెంటనే ప్రారంభించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, 25వ డివిజన్ కార్పొరేటర్ శకుంతలాదేవి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం

- కాపు కార్పొరేటర్లు, కాపు సంఘాల నేతలు
- కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయించిన సీఎంకు ధన్యవాదాలు



మాట్లాడుతున్న పశ్చిమ కాపు కార్పొరేటర్లు, కాపు సంఘాల నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాపు వర్గాలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి తాము అండగా ఉంటామని పలువురు కాపు కార్పొరేటర్లు, కాపు సంఘాల నేతలు పేర్కొన్నారు.పశ్చిమ నియోజకవర్గంలో కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయింపుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపేటలోని ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం మీడియా సమావేశంలో కాపు కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, అత్తలూరి ఆదిలక్ష్మి, ఇతర కాపు సంఘాల నేతలు మాట్లాడుతూ కాపు కల్యాణ మండపం కోసం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పెట్టిన ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదిస్తూ 480 గజాల స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానించడం అభినందనీయమన్నారు. గతంలో ప్రభుత్వాలు వచ్చినా కాపుల కోసం కల్యాణ మండప నిర్మాణం అనేది నెరవేరలేదన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చిన విధంగా నేడు పశ్చిమంలో కాపుల కోసం కల్యాణ మండపానికి కౌన్సిల్ స్థలం కేటాయించడం చారిత్రాత్మక విషయమన్నారు. 42 డివిజన్‌లోని వైఎస్సార్ పార్క్ సమీపంలో కాపు కల్యాణ మండపం కోసం 480 గజాల స్థలాన్ని కేటాయించడానికి కృషిచేసిన వెలంపల్లి, ఎంపీ కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, సహకరించిన కార్పొరేటర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ మండపం నిర్మాణం అయ్యేందుకుతామంతా కృషి చేస్తామన్నారు. సమావేశంలోకాపు సంఘం నాయకులు ఆకుల శ్రీనివాస్, ఎస్వీఆర్ రంగారావు, కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు మైలవరపు దుర్గారావు, నవ్యాంధ్ర కాపు సంఘం వ్యవస్థాపకులు కోన హేమసుందరరావు, వడ్లని మాధవరావు, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, మాజీ చైర్మన్ పదిలం రాజశేఖర్, సింహాచలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కూరకుల నాగ, చల్లంరాజు సత్రం మాజీ చైర్మన్ వాసా బాబు, నాయకులు వడ్డూరి యశోదర, ముక్కా రమణ, అల్లం పూర్ణ, దంగేటి పెద్ద కొండ, వరద రమేష్, అరసవిల్లి కంచిబాబు, సురకాశి శ్రీనివాసరావు, కర్రి గౌరీ, నారిండి శ్రీనివాస్, దొడ్ల రాజా, పల్లాంటి దుర్గారావు, మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలో 11 కేవీ జనప్రియ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పాత మసీదు, ఎస్ఎస్ఆర్ స్కూల్, సాయిబాబా గుడి, బీరువాల కంపెనీ, జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

లా అండ్ ఆర్డర్ డీసీపీగా కృష్ణకాంత్ పటేల్

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా లా అండ్ ఆర్డర్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా కృష్ణకాంత్‌పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కర్నూలు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ని జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు హోం శాఖ కేటాయించింది.



గుణదల పుణ్యక్షేత్రానికి ఉత్సవ శోభ

క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఉత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం మరియమాత జెండాను ఆవిష్కరించి నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. మఠకన్యలు, భక్తుల సమక్షంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మేరీమాత పతాకాన్ని ఆవిష్కరించారు.

–గుణదల (విజయవాడ తూర్పు)







రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం

డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురేంద్ర



రోడ్డు భద్రతపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీటీసీ పురేంద్ర, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశ ప్రగతిలో మానవ వనరుల పాత్ర కీలకమని డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.పురేంద్ర అన్నారు. రహదారి ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే రోడ్డు భద్రతపై తగిన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. బెంజిసర్కిల్ సమీపంలోని తమ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పురేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కృష్ణలంక సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ వాహన డ్రైవర్లకు కచ్చితమైన పనిగంటలు కేటాయించడం, రవాణా వాహనాలకు తప్పనిసరిగా రెండవ డ్రైవర్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించే వీలుంటుందన్నారు. రహదారి భద్రత లక్ష్యంగా కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ స్కూలు ద్వారా శాస్త్రీయంగా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కాజ వెంకట సత్య చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణ రాజు, చెన్నుపాటి వినయ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కాంట్రాక్టర్లు, అధికారులతో అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఆయన అభివృద్ధి పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే సమయంలో స్థానికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని అన్నారు. కాంట్రాక్టర్ చేసిన పనులు బిల్లుల చెల్లింపులో ఏఈలు సత్వరమే అధికారులకు నివేదించాలని, కాంట్రాక్టర్లకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఏఈలకు, డీఈ లకు, ఈఈలను ఆదేశించారు. ఇంజినీరింగ్ సిబ్బంది కాంట్రాక్టర్ల సమన్వయంతో నగరాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) నరసింహమూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్ (వర్క్స్) రామ్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన సేవలతోనే మళ్లీ అధికారం

పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆసీఫ్



55వ డివిజన్ కొండప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న ఆసీఫ్

వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో మళ్లీ వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో అధికారంలోకి వస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసీఫ్ పేర్కొన్నారు. బుధవారం 55వ డివిజన్ 173వ సచివాలయ పరిధిలోని కొండప్రాంతంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, స్థానిక కార్పొరేటర్ పూర్ణచంద్రరావుతో కలసి ఆయన పర్యటించారు. డివిజన్‌లో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం హయాములో కొండప్రాంతంలో ఎప్పుడు జరగని అభివృద్ధి ప్రస్తుతం తమ డివిజన్‌లో జరుగుతున్నాయని స్థానికులు ఆసీఫ్ ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్థానికులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసీఫ్ మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటు వేయండి అంటు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్న సీఎం జగన్ 175 స్థానాల్లోను విజయం సాధించి ప్రజలకు మేలైన పాలన అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, అర్షద్, అప్పాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సలీం, వెంకటలక్ష్మి, సైకం సాయిబాబు, కొరగంజి భాను, పల్లె బాబు, బాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

డీటీసీ పురేంద్ర



వైద్య శిబిరంను పరిశీలిస్తున్న డీటీసీ పురేంద్ర

విజయవాడస్పోర్ట్స్: దృష్టి లోపాలను అధిగమించేందుకు డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకు ఓ సారి కంటి పరీక్షలు చేయించుకోవాలని డెప్యూటీ టాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డీటీసీ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ.. కంటి చూపు మందగించినప్పటికీ కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. శారీరక వైకల్యం, వృద్ధాప్యంతో ఉన్న వారు వాహనాలు నడపొద్దన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీఓ వై.ఐశ్వర్యరెడ్డి, ఎంవీఐలు పి.వి.రమణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ఏఓ సీహెచ్.శ్రీనివాసరావు, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగమురళి పాల్గొన్నారు.

యువత పరిశోధనలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఫణీంద్ర

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమస్యలను నిశితంగా పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాటిని ఎలా పరిష్కరించాలనే అంశాలపై యువత ఆలోచనలు చేయాలని గుంటూరులోని విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఫణీంద్ర చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కంప్యూటర్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ సదస్సు ముగింపు సమావేశం సిద్ధార్థ కళాశాలలోని వెబ్‌నార్ హాలులో బుధవారం జరిగింది. ఫణీంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా పరిశోధనల ఆవశ్యకతను తెల్సుకోవాలని చెప్పారు. ఉద్యోగ నియమకాల్లో పరిశోధనల దృక్పధం ఉన్న యువతకు కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సీ, జావా, డేటా మేనేజ్‌మెంట్, వెబ్ సర్వీసెస్, డేటా స్టక్చర్స్ అంశాలపై యువత నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కోసం ఈ సదస్సు ఎంతగానో దోహదం చేసిందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా కళాశాల అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అతిథి ఫణీంద్రను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

● దుర్గగుడి ఈవోకు పితృవియోగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈవో కేఎస్.రామారావు తండ్రి డాక్టర్ కె. సత్యనారాయణరావు (93) బుధవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తిలో మృతి చెందారు. ఆయనకు కుమార్తె విజయగౌరి, కుమారుడు రామారావు ఇద్దరు సంతానం. భార్య శారదాంబ కొంత కాలం కిందట మృతి చెందగా, ఆయన కుమారుడు రామారావుతో కలిసి ఉంటున్నారు.